# దైవాంశ సంభూతులు

"ఎంత వరకు చెప్పాను?" అడిగాడు, దేవదాసు సీసాలోని బ్రాంది యింకొంచెం గ్లాసులో పోస్తూ.

"ఎంత వరకూ చెబితే ఏం కానీ, తాగేటప్పుడు రామాయణం, భారతం కథలు చెప్పవద్దని తాగుతున్న ప్రతి సారీ చెబుతున్నాను. ఏనాడన్నా వినిపించుకుంటేనా నువ్వు?" --- సణుగుతున్నాడు గాంధీ.

"తాగేటప్పుడు ఏ కథ అయితేనేం? వాడి నోటి దురద తీరేదాకా వాగుతుంటాడు - నువ్వు తాగుతూ వుండు. దట్సాల్ --" అన్నాడు శ్రీరాం గ్లాసు ఎత్తి నోరు తడుపుకుని.

"మీరు నోరు మూసుకోండోయ్ - నువ్వు చెప్పరా దేవదాసూ - అప్పుడు రాముడూ, సీతా, మూడోవాడెవడు - లక్ష్మణుడేనా?.....అరణ్య వాసానికి వెళ్ళబోతూ నదిని దాటుతున్నారు - అప్పుడేమయింది?" - అన్నాడు శాస్త్రి ఖాళీ గ్లాసును క్రింద పెడుతూ.

"ఆఁ! ఏం చెప్పాను?..... సరయూ నదిని దాటబోతున్నారు.... పడవ సిద్ధంచేసి, రెడీగా వున్నాడు మిష్టర్ గుహుడు", గ్లాసులోని బ్రాందీని యింకో గుటక వేసి, "ఎంత వరకు చెప్పాను?........." అడిగాడు దేవదాసు.

"నువ్వు చెబితే చెప్పు - లేకపోతే లేదు. అంతేగాని మధ్యలో వెధవ ప్రాంప్టింగ్ అడగకు. నాకు తలనొప్పి...." విసుక్కుంటున్నాడు శ్రీరాం.

"యస్-- చెబుతున్నాను. శ్రీరాముడు పడవ ఎక్కబోతూ ఒడ్డున నుంచుని దీనంగా చూస్తున్న జనాన్ని చూశాడు. వాళ్ళ మనసులోని బాధ గ్రహించాడు. వారి దగ్గరకు వచ్చి "సోదరులారా - సోదరీమణులారా.... మీరు నా మీద చూపుతున్న ఆప్యాయతను మరచిపోలేకుండా వున్నాను. మీ కందరికీ నా ధన్యవాదాలు. దయచేసి వెనక్కి తిరిగి అయోధ్యకు వెళ్ళి పొండి - సుఖంగా వుండండి" -- అని దీవించి, పడవ ఎక్కేశాడు. పడవ భారంగా కదిలింది!" ఆగాడు దేవదాసు.

"అంతమంది ఎక్కిన తర్వాత పడవ భారంగా కాకపోతే తేలిగ్గా కదులుతుందా భగవాన్లూ?" బ్రాందీ తాగుతూ అన్నాడు గాంధీ.

"కానీవోయ్!" అన్నాడు తను కానిస్తూ శాస్త్రి.

"తర్వాత రామాయణం ఇరవయి అయిదు రీళ్ళ తెలుగు సినిమాలా పధ్నాలుగు ఏళ్ళు బోలెడు మలుపులూ, సందులూ, అరణ్యాలు తిరిగింది. రాముడు కూడా అంతా తిరిగి తిరిగి, తన పని కానిచ్చి, సీతాలక్ష్మణులతో వెనుతిరిగాడు. మళ్ళీ సరయూ నదీ తీరానికి వచ్చారు. పడవ ఎక్కి ఆనందోత్సాహాలతో నదిని దాటి, ఒడ్డున అడుగు పెట్టారు. అప్పుడే చూశాడు రాముడు - నదికి ఈవలి ఒడ్డున ఇరవయి ముప్ఫయి మంది పెద్ద మనుషులు నుంచుని వున్నారు. గడ్డాలూ, మీసాలూ పెరిగిపోయి, గుబురుగా నేల మీదదాకా వ్రేలాడుతున్నాయి. చూడగా చూడగా వాళ్ళు దాదాపు పదిహేను ఏళ్ళ నుంచీ అలానే అక్కడే

నుంచుని వున్నట్టుగా అనిపించింది. స్నానపానాదులు లేవేమో వాళ్ళ దగ్గర బాగా దుర్గంధం వేస్తున్నది. ఆహార పానీయాలు లేవేమో ఎండిపోయి బక్క చిక్కి వున్నారు. "అసహ్యం" అన్న పదానికి నిర్వచనం వాళ్ళని చూస్తే చాలు తెలిసిపోతుంది. రాముడ్ని చూడగానే వాళ్ళ కన్నులలో కాంతి కనిపించింది. వారిలో చలనం వచ్చింది. గబగబా ముందుకు వచ్చి, రాముడి కాళ్ళకు సాష్టాంగ నమస్కారం చేశారు!" - దేవదాసు ఆగాడు యింకో చుక్క వేసుకుందామని.

"ఒరేయ్ దేవదాసూ! యిదంతా రామాయణంలో వుందిట్రా?" అడిగాడు గాంధీ - చిప్స్ చేతిలోకి తీసుకుంటూ.

"ఉంటే - వాడు చెప్పటమూ, మనం వినటమూ ఎందుకురా అవధాన్లూ? నీ అనుమానాలు అవతలకు తీసి, వాడు చెప్పేది విను. ఊఁ! చెప్పరా" అన్నాడు శ్రీరాం, యింకో బాటిల్ కార్క్ ఓపెన్ చేస్తూ.

"రాముడు సంభ్రమంతో అడిగాడు వారిని "ఎవరు బాబూ మీరు? మునులా, స్వాములా, బాబాలా? మీరెందుకిలా (కంపు కొడుతూ) వున్నారు? వాట్ హాపెండ్ టు యూ?" అని. వాళ్ళు ఒక్కసారిగా పైకి లేచి, మోకాళ్ళ మీద అంటుకున్న దుమ్మును దులుపుకున్నారు. అందరూ ఒక్కసారిగా గొంతెత్తి యిలా అన్నారు - "ఓ శ్రీరామచంద్ర ప్రభూ! నువ్వు దైవాంశ సంభూతుడివి. మేమెవరో తెలీక నువ్వు అడగటం లేదు. మమ్మల్ని పరీక్ష చేస్తున్నావు. అయినా అడిగావు కనుక చెబుతున్నాము. పది హేనళ్ళయిందేమో - నువ్వు వనవాసం వెళ్ళేటప్పుడు, నిన్ను చూసి పోదామని మన వూరి వారందరము ఈ నదీ తీరానికి వచ్చాము, గుర్తున్నదికదా! నువ్వు వెళ్ళిపోబోతూ ఆగి, మా దగ్గరకు వచ్చి "సోదర సోదరీమణులారా...... తిరిగి వెళ్ళండి" అన్నావు. అని అరణ్యవాసానికి వెళ్ళిపోయావు. అప్పుడు మాతో వచ్చిన పురుషులూ స్త్రీలూ అందరూ వెనక్కి తిరిగి అయోధ్యకు వెళ్ళిపోయారు. కాని మా సంగతి నువ్వు ఆలోచించలేదు. నీ ఆజ్ఞ లేకుండా మేము వెనక్కి తిరిగి ఎలా పోవటం? అందుకే యిన్నాళ్ళూ, యిలా యిక్కడే, ఈ ఒడ్డునే నుంచున్నాము. ఇన్నాళ్ళకు మమ్మల్ని కనికరించావు శ్రీరామచంద్రా!" అని మళ్ళీ రాముడి కాళ్ళ మీద పడ్డారు వాళ్ళందరూ. రాముడికి వారు చెప్పేది సగం అర్థం అయింది. కానీ మిగతా సగం అర్థం కాలేదు. అప్పుడు లక్ష్మణుడు "అన్నగారూ! మీరు స్త్రీలనూ, పురుషులనూ మాత్రమే తిరిగి వెళ్ళమన్నారట. వీరు ఆ రెండింటికీ చెందనివారు. ఆనాటినుంచీ ఈనాటి దాకా మీ ఆజ్ఞ కోసం ఎదురు చూస్తూ యిలా తయారయ్యారు" అన్నాడు. అప్పుడు రాముడు వారి ఆప్యాయతకూ, ప్రేమకూ, క్రమశిక్షణకూ మిగుల సంతోషించాడు. "స్నేహితులారా! మీ సేవా తత్పరతకి ఎంతో ఆనంధంగా వుంది. కొన్ని వేల సంవత్సరాల తర్వాత కలియుగం వస్తుంది. ఆ కలియుగంలో మీరందరూ సుఖపడేలా వరం యిస్తాను. ఆ కలి యుగంలో మీరంతా భారతదేశంలో ఫలానా వాళ్ళుగా పుట్టి, మీరు యిప్పుడు ఎంత త్యాగం చేశారో అంతకన్నా కొన్ని రెట్ల సౌఖ్యాన్నీ, సౌభాగ్యానీ, ఏమీ శ్రమ పడకుండా అనుభవించండి".... అని దీవించాడు".

"నీ ముఖంలా వుంది - ఆ ఫలానా ఏమిటో చెప్పి ఏడవరాదూ?" విసుక్కున్నాడు శ్రీరాం.

"ఏడుస్తాను - నాకు ఆ శ్రీరామచంద్రుడే కలలో కనబడి చెప్పాడు ఆ ఫలానా వాళ్ళెవరో, యిప్పుడు ఎక్కడ పుట్టారో! కానీ నేను చెప్పే లోగా, మీరు ఆలోచించి చెప్పాలి. యూస్ యువర్ బ్రెయిన్స్. టెల్ మీ!" దేవదాసు ఈ సారి గ్లాసు నిండా పోసుకుని త్రాగటం మొదలుపెట్టాడు.

"నే చెబుతాను, దేవుని పేరుతో మోసాలు చేస్తూ, ప్రజల్ని దోచుకుంటున్న బాబాలూ, అమ్మలూ!" అన్నాడు గాంధీ.

దేవదాస్ నవ్వాడు - "కాదు - యు ఆర్ రాంగ్. నువ్వు చెప్పు శ్రీరాం!"

"స్వార్థంతో, పదవీ వ్యామోహంతో తమ యిల్లు చక్క బెట్టుకుంటూ ప్రజల మాట మరచిపోయే రాజకీయ నాయకులు!" శ్రీరాం అభిప్రాయం.

"నో! యు ఆర్ ఆల్ సో రాంగ్!"

"తెలుగు సినిమాల్లో బూతు పాటలు రాసే వాళ్ళు - ఆ జన్మలో అనుభవించలేనిది, ఈ జన్మలో యిలా రాసి అనుభవిస్తున్నారు!" శాస్త్రి అభిప్రాయం.

"కాదు-కాదు!!" అన్నాడు దేవదాస్.

"నే చెప్పనా! అక్రమ వ్యాపారాలు చేసే వాళ్ళు-నల్ల బజారుగాళ్ళు - కల్తీ గాళ్ళు - లంచగాళ్ళు - దేశాన్ని అన్ని రకాలా నంజుకు తినే అరాచకం గాళ్ళు!" అన్నాడు గాంధీ.

"వీళ్ళెవరూ కారు...."

"పేదవాళ్ళను పీడిస్తూ పాతాళానికి తొక్కేసే ధన మధాంధులు!".

"నో!"

"అప్పు తీసుకుని ఎప్పుడూ తీర్చని అప్పారావ్‌లు!" అన్నాడు శాస్త్రి, శ్రీరాంని చూస్తూ.

"నో-నో".

"ప్రతి దానికీ నో-నో అంటావేమిట్రా సన్నాసీ! అదేమిటో చెప్పి చావకూడదూ...." విసుకున్నాడు శ్రీరాం.

"చెప్పనా..... చెబుతున్నాను వినండి. వినండి...." అంటూనే బాటిల్ ఎత్తి గడగడా త్రాగేశాడు దేవదాసు.

"చె...బు...తు...న్నా...ను" అంటూనే మైకం కమ్మి 'టప్' మని క్రింద పడ్డాడు దేవదాసు.

"దేవదాసూ!" ఆదుర్దాగా అన్నాడు గాంధీ.

"అంత తాగిన తర్వాత యిక వాడే లేస్తాడు? కథ ఎప్పుడు పూర్తి చేస్తాడు?" శాస్త్రి అన్నాడు.

"అయితే - ఇంతకీ ఎవరయి వుంటారు ఆ ఫలానాగాళ్ళు?" అడిగాడు శ్రీరాం.

"ఎవరో... దేవదాసులాంటి త్రాగుబోతులే అయి వుంటారు!" అన్నాడు శాస్త్రి, బాటిల్ ఎత్తి గడగడా త్రాగుతూ.